సాక్షి
వికారాబాద్

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023




నీటి కుంట..
వరద నీరు వృథాగా పోకుండా ఫాంపాండ్స్ తవ్వకుని నిల్వ చేస్తే ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగేందుకు తోడ్పడుతాయి. 8లో▸



అభివృద్ధికి కట్టుబడి ఉన్నా
తాండూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నా నని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. యాలాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 8లో▸



ఆదరణ కరువై..
మట్టి పాత్రలకు ఆదరణ తగ్గిపోతుండటంతో కులవృత్తులు కునారిల్లుతున్నాయి. బతుకు భారంగా మారుతోంది. 9లో▸



న్యూస్‌రీల్

నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన



అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన సోమవారం నుంచి చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం వికారాబాద్, తాండూరు ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు మున్సిపల్ పరిధిలో 9,436, పరిగి మున్సిపల్ పరిధిలో 1,151 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వికారాబాద్, కొడంగల్ దరఖాస్తుల వివరాలను సోమవారం లోపు ఇవ్వాలని తెలిపారు. వెరిఫికేషన్ కోసం రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో టీంలను ఏర్పాటు చేయాలని సూచించారు. అర్హులను గుర్తించాలని ఆయన ఆదేశించారు.

జగదీశ్‌కు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న జగదీశ్

అనంతగిరి: దళిత సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు జగదీశ్ బహుజన సాహిత్య అకాడమి అందించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ సమావేశంలో ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు రావడం ఆనందంగా ఉందని, మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కుల కోసం పోరాడుతానన్నారు.

మహనీయుల జీవితాలే మనకు ఆదర్శం



సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వికారాబాద్ అర్బన్: సమాజం కోసం పాటుపడిన మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుశీల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బహుజన రాజ్య స్థాపనకు పోరాటం చేసిన గొప్ప వ్యక్తి పాపన్న అని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరువాత మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ గౌడ్, సంఘం సభ్యులు సుధాకర్ గౌడ్, వెంకటయ్య గౌడ్, ఎంపీపీ చంద్రకళ, జిల్లా అధికారి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడిపై తండ్రి కత్తితోదాడి

మర్పల్లి: కుమారుడిపై తండ్రి కత్తితో దాడిచేశాడు. ఈ ఘటన మర్పల్లి మండలం పట్లూరులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్లూర్‌కు చెందిన చావల రామయ్యకు నగేశ్, కృష్ణ అనే ఇద్దరు కుమారులు. పూర్వీకుల నుంచి సంక్రమించిన 2 ఎకరాల భూమి తండ్రి రామయ్య పేరున ఉంది. కుమారులకు వాటా ఇవ్వకుండా రామయ్య సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భూమిలో తమకు వాటా కావాలని తండ్రిని కుమారులు కోరారు. తండ్రి ససేమిరా అన్నాడు. ఈ విషయమై పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టారు. మాటమాటా పెరగడంతో ఆవేశానికి గురైన తండ్రి కత్తితో పెద్దకుమారుడిపై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో భవానీ మాత



అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న మహిళలు

అమ్మభవానీ.. ఆదుకో జననీ

బషీరాబాద్ మండలం దామర్‌చెడ్ భవానీ మాత ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన ఆదివారం 108 మంది దంపతులు అమ్మవారికి మహా అభిషేకం చేశారు. అనంతరం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష కుంకుమార్చన చేశారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పీఠాధిపతి శంకర్ స్వామీజీ ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు.

– బషీరాబాద్

విజయీభవ

నేటి నుంచే టెన్త్ పరీక్షలు
- గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- ఐదు నిమిషాల ఆలస్యానికి అనుమతి
- 74 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- జిల్లాలో హాజరుకానున్న 13,727 మంది విద్యార్థులు
- సర్వం సిద్ధం చేశాం: డీఈఓ రేణుకాదేవి



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్: టెన్త్ వార్షిక పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. విద్యాశాఖ అధికారులు ఆదివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ సూచించారు. పరీక్షలు జరిగే సమయాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాలలో మంచినీళ్లు, టాయిలెట్లు, లైట్లు, ఫ్యాన్లు, బెంచీలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఎండలు తీవ్రమవడంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆరోగ్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు.

కాపీయింగ్ నిరోధానికి చర్యలు

కాపీయింగ్ నిరోధానికి విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడితే ఇన్విజిలేటర్లను బాధ్యులను చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. పదో తరగతిలో మాస్‌కాపీయింగ్‌పై హైకోర్టు గతంలో హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లాలో కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. పరీక్షల సక్రమ నిర్వహణకు గాను కేంద్రాలవద్ద 144 సెక్షన్ విధించారు. అదే విధంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సకాలంలో బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు విద్యాశాఖ సూచించింది. బస్‌పాస్‌లు ఉన్న విద్యార్థులు వారి పాఠశాలకు కేటాయించిన రూట్ కాకుండా ఏ రూట్‌లో పరీక్షా కేంద్రం ఉన్నా అక్కడి వరకు పాసులు చెల్లుబాటు అవుతాయని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు.

13,727 మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా 13,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 6,987 మంది బాలురు, 6,740 మంది బాలికలు ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 74 కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 వరకు పరీక్షలు జరుగుతాయి. గంట ముందే సెంటర్లకు చేరుకోవాలని అధికారులు సూచించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా అంటే 9.05 నిమిషాల వరకు లోపలికి అనుమతిస్తారు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, కాంపోజిట్ తెలుగు కోర్స్ రాసే విద్యార్థులకు అదనంగా 20 నిమిషాల సమయం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

నిర్భయంగా రాయండి



విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. ఆందోళన చెందకుండా నేర్చుకున్నవి ధైర్యంగా రాయాలి. ఈ సారి గతంతో పోలిస్తే మంచి ఫలితాలు సాధించేలా అన్ని చర్యలు తీసుకున్నాం. సందేహాలు ఉంటే 08416–235245 నంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలి.

– రేణుకాదేవి, డీఈఓ

భానుడి ప్రతాపం.. రోడ్లన్నీ నిర్మానుష్యం

పెద్దేముల్: ఉదయం 9 దాటిందంటే చాలు భానుడి భగభగలతో జనం తల్లడిల్లిపోతున్నారు. రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. వ్యవసాయ, ఇతర పనులకు వెళ్లే దినసరి కూలీలు ఉదయం 11 గంటలకే ఇంటి బాటపడుతున్నారు. మధ్యాహ్నం అయితే చాలు జనాలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. రాత్రి 7 గంటలు దాటినా వాతావరణంలో వేడి తగ్గడంలేదు. ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే ఇలా ఉందంటే.. మే నెలలో ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత ఏడాది చివరలో 44 డిగ్రీల సెల్సియస్ నమోదైన ఉష్ణోగ్రతలు.. ఇప్పుడు ప్రారంభంలోనే దరిదాపులోకి వస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే దడ పుడుతుందని వారు అంటున్నారు. ఎండల ప్రభావంతో కొబ్బరి బోండాలు, శీతలపానీయాలు, మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లు, జ్యూస్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పాదచారులు చలివేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.



నిర్మానుష్యంగా మారిన తాండూరు- సంగారెడ్డి రహదారి



దిమ్మెలు కూలిపోవడంతో ప్రమాదకరంగా మారిన వంతెన

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరేం

ప్రమాదకరంగా మద్గుల్ చిట్టంపల్లి బ్రిడ్జి

వికారాబాద్ అర్బన్: ప్రాణాలు పోతున్నా అధికారుల్లో చలనం లేదు. సోషల్ మీడియాలో సమస్యను ట్రోల్ చేస్తున్నా నాయకులు స్పందించడం లేదు. కలెక్టరైనా స్పందిస్తారన్న ఆశతో గ్రామస్తులు, వాహనదారులు ఎదురుచూస్తున్నారు. నిర్లక్ష్యం ఎవరిదో కానీ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న మద్గుల్ చిట్టంపల్లి పెద్ద వాగు బ్రిడ్జి పూర్తి శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జిపై రెండు వైపులా దిమ్మెలు పడిపోయాయి. దీంతో వాహనాలు అదుపుతప్పి వాగులో పడుతున్నాయి. గత ఏడాది ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. గత నెల 17న మద్గుల్ చిట్టంపల్లికి చెందిన కావలి పార్వతమ్మ తన బంధువుతో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి వాగులో పడిపోయారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ పార్వతమ్మ ఇటీవలే మృతిచెందింది. బ్రిడ్జిపై రహదారి బాగాలేకపోవడం.. మరోవైపు దిమ్మెలు ఊడిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జిపై దిమ్మెలు బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.



బ్రిడ్జిపై నుంచి పడిపోయిన వాహనదారులు (ఫైల్)

మొక్కలను తొలగిస్తుండ్రు



డివైడర్‌పై ఉన్న మొక్కలను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది

- నాడు రూ.లక్షలు వెచ్చించి నాటారు
- నేడు జేసీబీతో తొలగించారు
- మున్సిపల్ అధికారుల నిర్వాకంపై విమర్శలు

తాండూరు: రెండేళ్ల క్రితం మున్సిపల్ అధికారులు రూ.లక్షలు వెచ్చించి తాండూరు– హైదరాబాద్ మార్గంలో మొక్కలు నాటారు. అవి ఏపుగా పెరిగి పెద్దయ్యాయి. ఆదివారం జేసీబీతో తొలగించడంతో విమర్శలకు తావిస్తోంది. తాండూరు మున్సిపాలిటీకి 2018లో చైర్‌పర్సన్ సునీతసంపత్ పాలకవర్గం ఉన్న సమయంలో రూ.25 కోట్ల నిధులు వచ్చాయి. ఈ నిధులను రోడ్ల విస్తరణతో పాటు డివైడర్లు, నిడియన్ ప్లాంటేషన్ల పనులకు వెచ్చించారు. రోడ్లను వెడల్పు చేయడంతో మధ్యలో మొక్కలను పెంచేందుకు వీలుగా డివైడర్లను కట్టారు. ఆ తరువాత మొక్కలను నాటారు. రెండేళ్ల కాలంలో పెద్దగా మారాయి. అయితే ఆ మొక్కలను ఎలాంటి అనుమతులు లేకుండా తొలగించడం తాండూరులో చర్చనీయాంశమైంది. ప్రభుత్వం రూ.కోట్ల నిధులను వెచ్చించి హరితహారం కార్యక్రమం నిర్వహిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల అబాసుపాలవుతోందని పలువురు వాపోతున్నారు.

సమాచారం లేదు..

హైదరాబాద్ రోడ్డు మార్గంలో నిడియన్ ప్లాంటేషన్‌లో ఉన్న మొక్కలను తొలగించిన విషయం తన దృష్టికి రాలేదు. రెండేళ్ల క్రితం రంగు రంగుల పూల మొక్కలను నాటాం. వాటితో రోడ్డుకు కళ వచ్చింది. మొక్కలను ఎందుకు తొలగించారనేది తెలియదు.

– శ్యాంసుందర్‌రావు, ఎఫ్ఆర్‌ఓ, తాండూరు

ఫుల్ కిక్కు



- మద్యం విక్రయాలతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం
- రాష్ట్ర వ్యాప్తంగా రూ.35,000 కోట్ల రాబడి
- గ్రేటర్ జిల్లాల నుంచే రూ.13,518.87 కోట్లు
- అత్యధికం రంగారెడ్డి జిల్లా నుంచే..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మద్యం విక్రయాలు ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపించాయి. గత ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు) గ్రేటర్ జిల్లాల నుంచి రూ.13,518.87 కోట్ల ఆదాయం సమకూరడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా రూ.35 వేల కోట్ల ఆదాయం వస్తే.. ఈ మూడు జిల్లాల నుంచే 42–45 శాతం రావడం గమనార్హం. మద్యం అమ్మకాల్లో రూ.8436.14 కోట్లతో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలవగా.. రూ.3,752. 96 కోట్లు ఆదాయంతో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. రూ.1,329.78 కోట్లతో మేడ్చల్ జిల్లా మూడో స్థానంలో నిలిచింది.

ఇక్కడే ఎక్కువ ఎందుకంటే?

ఐటీ అనుబంధ సంస్థలు ఇక్కడ అధికం. ఉద్యోగుల నెలసరి వేతనాలు రూ.లక్షల్లో ఉన్నాయి. జాతీయ, అంతర్జాతీయ కంపెనీల రాకతో శివారు జిల్లాల్లోని భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. మార్కెటింగ్ ఏజెంట్ల ఆదాయం భారీగా ఉంటుంది. శుభ కార్యాల్లోనే కాదు వీకెండ్ పేరుతో విందులు, వినోదాల్లో మద్యం తప్పనిసరైంది. లిక్కర్ అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి. ఖరీదైన మద్యం అమ్మకాలు కూడా ఇక్కడే అధికం.

గ్రేటర్‌లో మద్యం అమ్మకాలు (రూ.కోట్లలో..)

నెల	హైదరాబాద్	రంగారెడ్డి	మేడ్చల్
ఏప్రిల్	260.62	629.02	100.55
మే	307.41	704.64	114.82
జూన్	298.61	685.47	107.31
జూలై	359.82	741.89	119.07
ఆగస్టు	323.72	726.33	117.44
సెప్టెంబర్	299.04	671.79	102.32
అక్టోబర్	345.04	731.77	119.28
నవంబర్	277.05	579.79	84.53
డిసెంబర్	382.28	881.21	140.89
జనవరి	287.23	666.86	103.81
ఫిబ్రవరి	310.59	710.75	111.47
మార్చి	300.75	706.62	108.29

క్వింటాలు ఉల్లి @70

- రైతన్న బిక్కమొఖం
- పెట్టుబడులూ రానిదుస్థితి
- నిండాముంచిన వడగళ్ల వాన
- పొలాల్లోనే వదిలేస్తున్న దుస్థితి



పొలంలోనే వదిలేయడంతో మొలకలు వస్తున్న ఉల్లి

మోమిన్‌పేట: ఇటీవల కురిసిన వనగండ్ల వాన ఉల్లి రైతును నట్టేట ముంచితే.. ఉన్న కాసింత దిగుబడులను మార్కెట్‌కు తరలిస్తే ధరలేక నష్టాలపాల్జేసింది. కోతకు వచ్చిన ఉల్లిని తీసి మార్కెట్‌కు తరలిస్తే క్వింటాలు రూ.70 పలికింది. కనీసం పెట్టుబడులు కూడా రాలేదని రైతులు తెలిపారు. చేసేదిలేక పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. పొలాలకు వెళ్తే దుర్గంధపు వాసన వస్తుందని రైతులు చెబుతున్నారు. వనగండ్ల వాన నిండా ముంచిందన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. సయ్యద్ అల్లిపూర్, ఎన్కేపల్లి, అంరాధికుర్దు గ్రామాలలో ఉల్లి చేతికి వచ్చే పరిస్థితి కన్పించడం లేదని చెబుతున్నారు. మిగతా గ్రామాల్లో 40శాతం నుంచి 60 శాతం మేర నష్టం వాటిల్లింది. ఆ గ్రామాలలో కూడా నిలువ ఉండే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. మార్కెటులో క్వింటాలుకు కనీసం రూ.1000 అమ్మితే తప్ప పెట్టుబడులు రావని పేర్కొంటున్నారు.

పొలంలోనే వదిలేశా..



రెండు ఎకరాల్లో ఉల్లిని సాగు చేశా. అఖరి తడి ఇచ్చాను. ఇంకో వారంలో కోతకు వచ్చేది. అప్పుడే వడగళ్ల వర్షం కురిసింది. పంటంతా పూర్తిగా నాశనం అయ్యింది. ఎంతో కొంత వస్తుందని 10 క్వింటాళ్లు తీసి సదాశివపేట మార్కెటుకు తరలిస్తే క్వింటాలుకు రూ.70 పలికింది. నాచేతికొచ్చింది రూ.580. కూలీలు, రవాణా ఖర్చు చేతినుంచే పెట్టాల్సి వచ్చింది. చేసేదిలేక పొలంలోనే వదిలేశా.

– రైతు పట్లోళ్ల రాంచంద్రారెడ్డి, ఎన్కేపల్లి

కోతకు వచ్చేవేళ..



అర ఎకరాలో ఉల్లిని సాగు చేశా. కోతకు వచ్చింది. తీసే సమయంలో వడగండ్ల వాన కురవంతో పూర్తిగా దెబ్బతింది. పొలంలో వాసన వస్తోంది. గ్రామంలో ముగ్గురు రైతులు ఉల్లి కోత కోసి మార్కెటు తరలిస్తే క్వింటాలుకు రూ.70కి అమ్ముడుపోయింది. దీంతో నేను పొలంలోనే వదిలేశా. నష్టాలే మిగిల్చాయి.

– రైతు రావులపల్లి మానిక్‌రెడ్డి, ఎన్కేపల్లి

క్లుప్తంగా

కలప ట్రాక్టర్ సీజ్

ధారూరు: నిబంధనలకు విరుద్ధంగా కలప తరలిస్తున్న ట్రాక్టర్ పోలీసులు పట్టుకుని.. ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని అంపల్లి గ్రామం నుంచి ఓ ట్రాక్టర్‌లో కలప తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ఫారెస్టు అధికారులకు అప్పగించారు. ఇన్‌చార్జి ఫారెస్టు రేంజ్ అధికారి కృష్ణ మాట్లాడుతూ.. ట్రాక్టర్‌ను సీజ్ చేశామని.. కలప విలువను బట్టి యజమానికి జరిమానా విధిస్తామన్నారు. జరిమానా చెల్లించకుంటే కేసును కోర్టుకు అప్పగిస్తామన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో చోరీ

కుల్కచర్ల: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మార్చి 27న కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తలుపులు బద్దలు కొట్టి ఆలయంలో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. ఈ మేరకు అయ్యప్ప స్వామి సేవాసమితి మండల అధ్యక్షుడు పటోళ్ల వెంకట్రామిరెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

అనారోగ్యంతో వీఏఓ మృతి


అంజిలమ్మ(ఫైల్)

దోమ: మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామానికి వీఏఓ (గ్రామ సహాయకురాలు) దొడ్ల అంజిలమ్మ మృతి చెందారు. ఆమె కొంత కాలంగా లివర్ వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని అపోలో ఆస్పత్రిలో వైద్యం అందించారు. ఆరోగ్యం క్షీణించి ఆదివారం తుదిశ్వాస విడిచింది. మండల మహిళబూా సమాఖ్య సిబ్బంది ఆమె మృత దేహానికి నివాళి అర్పించారు. కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి ఆమె వైద్య ఖర్చులకు రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


శ్రీనివాస్(ఫైల్)

కొడంగల్ రూరల్: లారీ, బైక్ ఢీకొన్న సంఘటనలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అంగడిరాయిచూర్ గ్రామానికి చెందిన మొట్టె శ్రీనివాస్(35) అదే గ్రామానికి చెందిన చిన్న నర్సింలుతో కలిసి మార్చి 31న బైక్ పై కూలీ పనుల నిమిత్తం మల్‌రెడ్డిపల్లి గ్రామానికి వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి స్వగ్రామానికి ప్రయాణిస్తుండగా ప్యాలమద్ది గేటు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తలకు తీవ్ర గాయాలవ్వగా కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి.. అనంతరం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య భానుప్రియ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

క్వారీలో యువకుడి గల్లంతు

కొనసాగుతున్న గాలింపు

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ క్వారీలో ఈత కోసం వచ్చిన యువకుడు గల్లంతైన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్ఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. నగరంలోని ఉప్పుగూడకు చెందిన 6 మంది యువకులు ఆదివారం ఈతకొట్టడానికి కొంగరలాన్ కలెక్టరేట్ భవనం వెనకాల ఉన్న బోరబండ క్వారీలో దిగారు. ఈతకొట్టి ఐదుమంది యువకులు బయటకువచ్చారు. కానీ అందులో కిరణ్‌కుమార్(19) అనే యువకుడు గల్లంతయ్యాడు. క్వారీలో ఇరుక్కున్నట్లు స్నేహితులు చెప్పడంతో స్థానిక పోలీసులు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. రెస్క్యూ బృందాలు, డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు విరమించారు. సోమ వారం తిరిగి గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

నీటి కుంట... తీర్చును చింత

వర్షాకాలం వచ్చే వరద నీరు వృథాగా పోకుండా ఫాంపాండ్స్ తవ్వకుని నిల్వ చేస్తే ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగేందుకు తోడ్పడుతాయి. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు ఉపయోగపడుతాయి. ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలతో పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇందుకు అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- ఫాంపాండ్స్ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- ముందుకురాని రైతులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు


దౌల్తాబాద్‌లో తవ్విన ఫాంపాండ్ (ఇన్‌సెట్‌లో) ఊరగుంటలో తవ్విన ఫాంపాడ్‌లో నిలిచిన నీరు

దౌల్తాబాద్: వాగులు వంకల ద్వారా వృథాగా పోయే వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. నదులపై ప్రాజెక్టులు, వాగులపై చెక్‌డ్యాంలు నిర్మిస్తోంది. ఈ క్రమంలో భూగర్భజలాలు పెంపునకు రైతులు ఫాంపాడ్స్ తవ్వకునేలా ప్రోత్సహిస్తోంది. తద్వారా బోర్లు, బావులు రీఛార్జి అవడంతో పాటు కుంటల్లోని నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ మేరకు ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న నీటికుంట(ఫాంపాండ్స్)లతో రైతులకు నీటి చింత తీరుతుందని ఉపాధి హామీ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు నయా పైసా ఖర్చు లేకుండా నీటి కుంటలను నిర్మించుకోవచ్చంటున్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని రైతులకు మంజూరైనా.. అవగాహన లేకపోవడంతో నీటి కుంటలను తవ్వుకునేందుకు ఆసక్తి చూపడంలేదు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి తవ్వుకునేలా ప్రోత్సహిస్తున్నారు. భూమి నష్టపోతామనే ఆలోచనతో రైతులు ఫాంపాండ్స్ తవ్వకునేందుకు ముందుకు రావడంలేదు.

వేసవిలోనూ నీరు పుష్కలం

నీటి కుంటలతో భూగర్భ జలాలు పెంపొందుతాయి. వీటి నిర్మాణంతో వ్యవసాయ క్షేత్రంలోని సాగు భూమిలో కొంతపోయినా భూగర్భజలాలు మాత్రం పెరుగుతాయి. వేసవిలోనూ బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉంటుంది. భారీ వర్షాలకు భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. ఎగువ ప్రాంతం నుంచి నీటితో పాటు వచ్చిన మంచి మట్టి గుంతలోకి చేరుతుంది. ఈ మట్టి పొలాలకు ఎరువుగా ఉపయోగపడుతుంది. ఏటా కుంటలో నుంచి మట్టిని పొలాల్లో వేసుకోవచ్చు. బోరుబావుల నుంచి కొద్దిపాటి నీరు వచ్చినా నీటి కుంటలను నింపుకుని ఒకేసారి పంటలకు నీటి తడులు అందించే వీలుంటుంది. దీంతో ఎకరం పొలానికి అవసరమయ్యే నీటితో రెండెకరాలు సాగు చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. నీటికుంటలతో వర్షాభావ పరిస్థితుల్లోనూ పంటలకు ఇబ్బంది ఉండదని పేర్కొంటున్నారు.

పల్లపు ప్రాంతంలో నిర్మాణం

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడంతో రైతులకు ప్రయోజనం చేకూర్చే నీటికుంటల నిర్మాణానికి రైతులు పైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. మొదట రైతులు వర్షపు నీటిని పొలంలో ఎక్కడ నిల్వ చేసుకోవాలో గుర్తించాలి. పల్లపు ప్రాంతంలో నీటికుంట నిర్మించుకోవాలి. ఈ మేరకు ఉపాధి హామీ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే సిబ్బంది ఇచ్చే కొలతల ప్రకారం ఫాంపాండ్స్ తవ్వాలి. తవ్వకం పనులు ఉపాధి కూలీలే చేపడతారు. ఇందుకు రైతు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. 6చదరపు మీటర్ల వెడులు, 4మీటర్ల పొడవు, 2లేదా 3మీటర్ల లోతు వరకు నీటికుంటలను నిర్మించుకోవచ్చని అధికారులు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్నాం

రైతులు వ్యవసాయ పొలాల వద్ద ఫాంపాండ్స్ ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. ఫాంపాడ్స్ ఏర్పాటుతో భూమి పోతుందని నిర్మించుకునేందుకు ముందుకురావడం లేదు. వీటితో కలిగే లాభాలను రైతులకు వివరించి నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నాం.

– రజనీకాంత్, ఏపీఓ, దౌల్తాబాద్

అధికార పార్టీలో అసమ్మతి

- ఎమ్మెల్యే ఆనంద్ తీరుపై సొంత పార్టీ నేతల తిరుగుబావుటా
- గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం
- వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరిక

అనంతగిరి: పార్టీ పటిష్టానికి పనిచేసినప్పుడు ఎమ్మెల్యే టికెట్ ఆశించడంలో తప్పేముందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను సొంత పార్టీ నేతలు ప్రశ్నించారు. ఆదివారం పార్టీ అసమ్మతి నేతలు వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేట్ పోస్టుల్లో ఉద్యమంలో, పార్టీ కోసం పనిచేసిన వారికి మొండి చేయి చూపుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేను చేసేందుకు కష్టపడిన కేడర్‌ను పక్కకు పెట్టి ఇతరులకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టడం సరికాదని మండిపడ్డారు. పార్టీ బీ ఫాంపై గెలిచి స్వలాభం కోసం చూసుకుంటున్నారని ఆరోపించారు. మీ వెంట ఉన్న నాయకులు పార్టీలోకి ఎప్పుడు వచ్చారో గమనించాలన్నారు. వారు అనవసరంగా వ్యక్తిగత విమర్శలకు దిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అందరిని సమన్వయం చేయాల్సిన ఎమ్మెల్యేనే ఈ పరిస్థితికి కారణమవుతున్నారని ఆరోపించారు. తాము పార్టీ కోసం పనిచేస్తామే తప్ప వ్యక్తుల కోసం పనిచేయమన్నారు. అధిష్టానం అన్ని విషయాలు గమనిస్తోందని, ఇక్కడ మమ్మల్ని అవమానాలకు గురిచేసిన తాము భరిస్తున్నామని.. ఇకముందు సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు భూమెళ్ల కృష్ణయ్య, మర్పల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ రామేశ్వర్, సీనియర్ నాయకులు పంది వెంకటయ్య, రమేశ్, రాజేందర్‌గౌడ్, ప్రకాశ్, హన్మంత్, ఆయా మండలాల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అసమ్మతి నేతలు

అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలు


ఇంటింటి ప్రచారంలో రామ్మోహన్‌రెడ్డి తదితరులు

- ఏకకాలంలో పంట రుణాల మాఫీ
- జోడో యాత్రతో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: అసైన్డ్ భూములున్న రైతులు క్రయ, విక్రయాలు చేసుకునేందుకు వీలుగా శాశ్వత పట్టాలు ఇప్పిస్తామని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని లక్నాపూర్ గ్రామంలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులతో కలిసి ఇంటికి ఇంటికి తిరుగుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేబట్టబోయే సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మాత్రమే నిరంతరం పనిచేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకువచ్చి ప్రజలను మోసం చేశారని.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామన్నారు. రైతులు తీసుకున్న పంట రుణాలను ఏకకాలంలో రుణమాఫీ చేస్తామన్నారు. వంట గ్యాస్ ధరలను పెంచి ఇంట్లో మంటలు పెట్టారన్నారు. నిత్యావసర ధరలు పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల నడ్డి విరుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరిస్తూ ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులు, నిరుద్యోగులతో చెలగాటమాడుతున్నారన్నారు. పేపర్ల లీకేజీ వెనుక ప్రభుత్వం హస్తం ఉంది కనుకే దర్యాప్తును నీరుగారుస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌కు పట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, సర్పంచ్ వెంకటయ్య, నాయకులు రామకృష్ణారెడ్డి, మల్లేశ్, చిన్ననర్సింలు, జగన్మోహన్, తౌరియానాయక్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

- ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది
- ఆత్మీయ సమ్మేళనంలో తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి


యాలాల: ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

యాలాల: తాండూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ శివారులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ససందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి వారికి పూర్తిస్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న బీఆర్ఎస్‌కు మాత్రమే ప్రజలను ఓటు అడిగే హక్కు ఉందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వెనుకబడిన గ్రామాలను నేడు సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. సీఎం చొరవతో రూ.134కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్‌డీఎఫ్)ను నియోజకర్గానికి కేటాయించామన్నారు. ఈ నిధుల నుంచి గ్రామానికి రూ.50లక్షల చొప్పున అభివృద్ధి పనులు చేపడుతున్నారని వివరించారు. కాలుష్య రహిత తాండూరుగా తీర్చి దిద్దేందుకు దశలవారీగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ మాటలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. గ్రామాల్లో హాత్ సే హాత్ జోడో యాత్రను చేపడుతున్న నాయకులను ప్రజలు ప్రశ్నించాన్నారు.

భారీగా జన సమీకరణ

ప్రతీ గ్రామం నుంచి ప్రజలను ఆత్మీయ సమ్మేళనానికి తీసకురావడంలో మండల నాయకులు సక్సెస్ అయ్యారు. ఈ సమ్మేళనానికి సుమారు 5వేల మంది తరలివచ్చారు. సమావేశం ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, వైస్ ఎంపీపీ రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, పార్టీ సర్పంచ్‌లు ఒంగోనిబాయి శ్రీనివాస్, శివకుమార్, పటేల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు పర్యాద కృష్ణమూర్తి, ఆశన్న, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాన పదకళల నుంచి విలువలను గ్రహించాలి

జాన పదకళల నుంచి విలువలను గ్రహించాలని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు హాజీపూర్‌లో నిర్వహించిన భక్త సిరియాల నాటక ప్రదర్శన శనివారం రాత్రితో ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గ్రామస్తులతో కలిసి నాటక ప్రదర్శనను వీక్షించారు. ఈ నాటకంలో నందమయ్య పంతులు పాత్ర పోషించిన సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన నాటక ప్రదర్శనకు రూ.21 వేలు అందజేశారు. ఆయన వెంట యాలాల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్ నాటక ప్రదర్శనను వీక్షించి తన వంతుగా రూ.6వేలు అందించారు. ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్, వైస్ ఎంపీపీ రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పైలెట్ వర్గంలోకి కోటబాసుపల్లి సర్పంచ్

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి సర్పంచ్ కె.నాగర్జున తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి వర్గంలోకి వెళ్లారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి వర్గంలో కొనసాగిన కోటబాసుపల్లి సర్పంచ్ తాజాగా ఆదివారం తాండూరు పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే కోటబాసుపల్లి అభివృద్ధికి సంబంధించిన రూ.50 లక్షల ప్రొసీడింగ్స్ త్వరలో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరేందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరక్టర్ సురేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మొగులప్ప, నాయకులు బి.సురేందర్, నారాయణగౌడ్,కె.రవి ,నరేష్, అశోక్‌కుమార్, బి.రవి ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

గంగా, జమునా, తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక

బీసీ కమిషనర్ సభ్యుడు శుభప్రద్ పటేల్

తాండూరు: గంగా, జమునా, తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని.. మతసామరస్య పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉపవాస దీక్షలు ముగిసిన అనంతరం ఆయన ముస్లింలకు ఉపవాస దీక్షలు విరమింప జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండగను ఆనందోత్సవాల నడుమ జరుపుకోవాలన్నారు. ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, నాయకులు కమల్‌అతార్, ఆబిద్, ముస్తాఫా పటేల్, జావీద్, షేద్ ఫరీద్, సాధిక్, ముజీబ్, రహీం, అబ్దుల్ ఘని, శుభప్రద్ యువసేన సభ్యులు భానుప్రసాద్, కుర్వబాలు, శ్రీశైలం, విజయ్, నరేశ్‌గౌడ్, రాము, కృష్ణ, హరీశ్, అన్వర్ తదితరులున్నారు.


ఉపవాస దీక్షలు విరమింంజేస్తున్న శుభప్రద్ పటేల్

నా గెలుపు బాధ్యత మీదే..

నరేశ్ మహరాజ్‌ను కోరిన సేడం ఎమ్మెల్యే రాజ్‌కుమార్ తెల్కూర్


నరేశ్ మహరాజ్‌తో మాట్లాడుతున్న సేడం ఎమ్మెల్యే రాజ్‌కుమార్ తెల్కూర్

తాండూరు: నియోజవర్గానికి చెందిన బీజేపీ నేత నరేశ్ మహరాజ్‌ను సేడం సిట్టింగ్ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ తెల్కూర్ ఎన్నికల ప్రచారానికి ఆహ్వానించారు. దీంతో ఆయన పక్షం రోజులుగా సేడం తాలూకాలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల ప్రచార సభలో 2008 ఎన్నికల్లో నరేశ్ మహరాజ్ ఓట్లు చీల్చడం వల్లే తాను ఓటమి పాలయ్యానని ఎమ్మెల్యే రాజ్‌కుమార్ తెల్కూర్ నిండు సభలో అన్నారు. ఈ సారి తన గెలుపు బాధ్యత తీసుకోవాలని కోరారు. దీంతో ఆయన సేడంలో ఎన్నికల ప్రచారంలో బిజీ అయ్యారు.

కమలం గూటికి 'మహరాజ్'లు

తాండూరు నియోజకవర్గ పరిధిలో దశాబ్దాల కాలంగా రాజకీయాలలో కొనసాగుతున్న మహరాజ్‌ల కుటుంబానికి కర్ణాటక సరిహద్దులో మంచి ప్రజాభిమానం ఉంది. మహరాజ్‌ల కుటుంబం నుంచి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా కొనసాగారు. అయితే మాజీ మంత్రి చందు మహరాజ్ తనయుడు నరేశ్ మహరాజ్ సేడం తాలూకా నుంచి అసెంబ్లీ బరిలో నిలిచారు. అప్పట్లో ప్రధాన పార్టీల నుంచి టికెట్ లభించకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రధాన పార్టీల ప్రచారానికి ఏ మాత్రం తీసుపోకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 11వేల పైచిలుకు ఓట్లు సాధించి ఓటమి చెందారు. అయితే సేడంలో నరేశ్ మహరాజ్ ఓట్లను చీల్చడంతో బీజేపీ అభ్యర్థి ఓటమి చెంది కాంగ్రెస్ అభ్యర్థి గెలునకు కలిసొచ్చింది. తదనంతరం నరేశ్ మహరాజ్ సేడం రాజకీయాలకు గుడ్ బై చెప్పి తాండూరుకు వచ్చారు. 2014లో తాండూరు నుంచి టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా అసెంబ్లీ బరిలో నిలిచారు. ఇక్కడ పట్నం మహేందర్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. వచ్చే ఎన్నికల్లో తాండూరు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆరు నెలల క్రితం ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆయన సరిహద్దులో ఉన్న సేడం, చించోళి అసెంబ్లీ సెగ్మెంట్‌లలో పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం చేయాలని కర్ణాటక బీజేపీ నేతలు కోరడంతో అక్కడ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరోవైపు ఇతర పార్టీల్లో ముఖ్య నాయకులుగా కొనసాగుతున్న మహరాజ్ మద్దతుదారులను బీజేపీలో చేర్పించడంలో ఆయన సక్సెస్ అయ్యారు. ఇప్పటికే సేడంలో బీజేపీ, జేడీఎస్ బలంగా ఉన్నాయి. నరేశ్ మహరాజ్ రాకతో బీజేపీ గెలుపు ఖాయమంటూ బహిరంగ సభలో బీజేపీ నేతలు ప్రకటించడం విశేషం.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

ఆమనగల్లు: పట్టణ సమీపంలోని పెద్ద బ్రిడ్జి వద్ద హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ పరిధిలోని తుంకిబండ తండాకు చెందిన ఐశ్వర్య(10) అనే బాలిక మృతిచెందింది. ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య కథనం మేరకు.. తుంకిబండ తండాకు చెందిన కిరణ్ తన సోదరుని కుమార్తె ఐశ్వర్యను తన ద్విచక్ర వాహనంపై కూరగాయలు తెచ్చేందుకు ఆమనగల్లు వస్తుండగా పెద్ద బ్రిడ్జి వద్ద బైక్ ఆగిపోయింది. కిరణ్ బండిని పరిశీలిస్తుండగా ఐశ్వర్య పక్కన నిల్చుంది. ఇదే సమయంలో కల్వకుర్తి నుంచి వేగంగా వచ్చిన కారు ఐశ్వర్యను ఢీ కొట్టింది. బాలికకు తీవ్ర గాయాలు కావడంతో ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా బాలిక మృతిచెందింది. మృతురాలి తల్లి సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుందరయ్య తెలిపారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- సంగాయిపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

తలకొండపల్లి: ప్రపంచ మేధావుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అగ్రగణ్యుడని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. పార్లమెంట్ భవనానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని సంగాయిపల్లిలో పూలే, అంబేడ్కర్ జాతర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.సుధాకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ప్రజాకవి గోరటి వెంకన్న, బీజేపీ సీనియర్ నాయకుడు ఆచారి, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం కన్వీనర్ పాల్ దివాకర్ ముఖ్యఅతిథులుగా హాజరై విగ్రహావిష్కరణ చేశారు. అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకొవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ నిర్మల, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబుర్ రహ్మాన్, సర్పంచ్ లలిత, జ్యోతయ్య, బీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కొమ్ము తిరుపతి, దళిత సంఘం రాష్ట్ర నాయకుడు రాజు, పోలీస్ డైరెక్టర్ రజిత, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, అంబేడ్కర్ పూలె జిల్లా అధ్యక్షుడు శంకర్, బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కార్యదర్శి రమేష్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాం, రఘురాములు, మాజీ ఎంపీటీసీ యాదయ్య, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


యాదయ్య(ఫైల్)

తలకొండపల్లి: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని వెల్జాల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశు యాదవ్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండలం, డోకూరు గ్రామానికి చెందిన రామాంజమ్మ, చిన్న యాదయ్య దంపతులు. బతుకు దెరువు కోసం పిల్లలతో కలిసి తలకొండపల్లి మండలానికి వలస వచ్చారు. తల్లిదండ్రులు మండలంలోని వెల్జాల్ గ్రామంలో ఉంటున్నారు. పిల్లలు అరుణాచల డెవలపర్స్‌లో కూలి పనులు చేసున్నారు. మార్చి 18వ తేదీ ఉదయం 6.30 గంటల ప్రాంతంలో చిన్న యాదయ్య కిరాణా దుకాణానికి వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో ఆందోళలకు గురైన భార్య రామాంజమ్మ కిరాణ కొట్టులో విచారించింది. చిన్న యాదయ్య దుకాణానికి వచ్చి వెళ్లాడని దుకాణ దారుడు చెప్పాడు. దీంతో రామాంజమ్మ వెంచర్‌లో, తనకు తెలిసిన బంధువుల వద్ద విచారించింది. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆదివారం తెలిపారు.

గృహిణి అదృశ్యం

పహాడీషరీఫ్: భర్తతో గొడవపడిన ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... జల్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ సమద్.. సానియా ఫాతిమా(22)ను రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం సానియా నాలుగు నెలల గర్భవతి. కాగా ఈనెల 1న సాయంత్రం వంట విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం సమద్ నమాజ్‌కు వెళ్లగా.. ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు సానియా మెసేజ్ పంపింది. ఇంటికి వచ్చి చూడగా ఆమె కనిపించలేదు. ఈ మేరకు ఆదివారం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో సమద్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.